ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



Q6 NEWS తెలుగు



మేడ్చల్ | సోమవారం | 24.08.2026 | సంపుటి : 2 | సంచిక : 52 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్


## సీపీఎస్ రద్దు చేయండి.. మళ్లీ సీఎంను చేస్తాం

నవంబరు 17 నాటికి స్పందించకుంటే సామూహిక సెలవులు

టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ

ఎల్బీస్టేడియంలో జనజాగరణ యాత్ర ముగింపు సభ

సీఎం సార్.. సీపీఎస్ రద్దు చేయండి. నిన్న మిమ్మల్ని గెలిపించుకున్నాం.. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్‌ఈయూ) అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. నవంబరు 17 నాటికి ప్రభుత్వం స్పందించి సీపీఎస్ రద్దుపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా అందరూ సామూహిక సెలవులు పెట్టి, జిల్లా కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలు చేపడతామని హెచ్చరించారు.



**హైదరాబాద్, ఆగస్టు 23 :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటే మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ వ్యాఖ్యానించారు. ఇది తన ఒక్కడి మాట కాదని..రాష్ట్రంలోని 2.6 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల హామీ అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 11న -మిగతా 2 లో..



## ఖర్గేతో సురేఖ భేటీ?

కాంగ్రెస్‌ని, గాంధీ కుటుంబాన్ని విమర్శించలేదని చీఫ్‌కు వివరణ

సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్న ఖర్గే

క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇవ్వాలని సూచన

**హైదరాబాద్, ఆగస్టు 23 :** రాష్ట్ర కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆమె బెంగళూరుకు వెళ్లినట్లు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం కొండా సురేఖ కుమార్తె సుస్మిత.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఇందుకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు కొండా సురేఖ సమాధానం కూడా ఇవ్వడం తెలిసిందే. అయితే కొండా సురేఖే వెనక ఉండి తన కూతురితో మాట్లాడించారని, ఇందుకు మంత్రిపై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు కోరుతున్నారు. ఆమెను మంత్రివర్గం నుంచి తప్పిస్తారన్న ప్రచారం -మిగతా 2 లో..

## '22ఏ' కారణంగా వేల కుటుంబాలు కన్నీరు

30% కమీషన్ కోసమే ప్రభుత్వం పనిచేస్తోంది

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం కమీషన్ కోసమే పనిచేస్తోందని, పేదల భూములను కబ్జా చేసేందుకు 22ఏను తీసుకొచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. భూములను '22ఏ'లో చేర్చడంతో వేల కుటుంబాలు కన్నీరు పెడుతున్నాయన్నారు. వారిని పరామర్శించి, అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి బోడుప్పల్ తిరుమల మెడోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ప్రజల విలువైన భూములను చాకచక్యంగా కొట్టేసేందుకు 22ఏ జాబితాలో చేర్చారు. 02

## వస్తున్నా.. అన్ని అంశాలపై మాట్లాడతా

రాజకీయ కోణంలోనే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ: సీఎం రేవంత్‌రెడ్డి

కొండా ఎపిసోడ్‌పై సర్వత్రా ఉత్కంఠ

సీఎం స్పందిస్తారా? లేదా?

రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ పెట్టారు. "రాజకీయ కారణాల రీత్యా నా అమెరికా పర్యటనకు విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నా. విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు. లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. హైదరాబాద్‌కు వస్తున్నా. అక్కడికి వచ్చాక మిగిలిన అంశాలపై వచ్చాక మాట్లాడతా. గత మూడు రోజులుగా పార్టీ, నేతలు, ప్రజల నుంచి లభించిన అద్భుతమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



**హైదరాబాద్, ఆగస్టు 23 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లండన్ నుంచి సోమవారం హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఉదయం 5.15 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న సీఎంకు పలువురు మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు స్వాగతం పలకనున్నారు. అయితే రేవంత్ రాక నేపథ్యంలో కొండా సురేఖ ఎపిసోడ్‌లో ఏం జరగనుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటనకు వెళ్లడానికి కొన్ని గంటల ముందు కొండా సుస్మితా పటేల్.. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు -మిగతా 2 లో..



## మళ్లీ పార్లమెంట్ సమావేశాలు!

పునర్విభజన బిల్లుపై మళ్లీ చర్చ..

రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడతారని ప్రచారం

వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రోరోగ్ చేయని ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 23 : పార్లమెంటు ఉభయ సభలు ఈ నెల 13వ తేదీన నిరవధికంగా వాయిదాపడినా సమావేశాలు ముగిసినట్లు (ప్రోరోగ్ అయినట్లు) రాష్ట్రపతి అధికారిక ప్రకటన ఇంకా వెలువరించకపోవడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సభలను ఉభయ సభాపతులు నిరవధికంగా వాయిదా వేసిన రెండు మూడు రోజుల్లో సమావేశాలు ముగిసినట్లు రాష్ట్రపతి ప్రకటిస్తుంటారు. ఈసారి దాదాపు 11 రోజులైనా అలాంటి ప్రకటనేదీ వెలువడకపోవడంతో కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 నుంచి అమలు చేసేందుకు వీలుగా తేనున్న - మిగతా 2 లో..



## కాంగ్రెస్ దగాపై సమరభేరి

వేయి రోజులు పూర్తయినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదు

సెప్టెంబర్ 2 నుంచి వినూత్న కార్యక్రమాలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 23 :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన హామీలు, పాలనా వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ సమరభేరికి సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలను కలుస్తూ వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీ సభ్యులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి, వంద రోజుల్లో వాటిని అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ వేయి రోజులు పూర్తయినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని కేటీఆర్ ఆరోపించారు. గ్రామగ్రామాన కాంగ్రెస్ మోసాన్ని -మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## పార్టీ లైన్ దాటి మాట్లాడితే కఠిన చర్యలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 23 :** కాంగ్రెస్ నేతలు ఎవరైనా పార్టీ నియమాలు దాటితే కఠిన చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఏమైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చెప్పుకోవాలని.. దీనికోసం వివిధ కమిటీలు ఉన్నాయని చెప్పారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు చెప్పుకోవచ్చన్నారు. అంతేకానీ పార్టీ లైన్ దాటి బహిరంగ విమర్శలు చేయొద్దని హితవు పలికారు. ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ -మిగతా 2 లో..





## 14 దేశాలకు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుల నియామకం

పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటన 02

## రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నాశనం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ నాశనమైందని, ప్రతి పనిలోనూ 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. విద్యార్థులకు అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక) -మిగతా 2 లో..



# వస్తున్నా.. అన్ని అంశాలపై మాట్లాడతా

(మొదటిపేజీ తరువాయి)

చేసిన విషయం తెలిసిందే. అయితే ఆమె రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కావడంతో రాజకీయ వర్గాల్లో ఆమె వ్యాఖ్యలు ఒక్కసారిగా కలకలం రేపాయి. ప్రభుత్వంలో బాధ్యత గల మంత్రి కుమార్తె అయివుండి.. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ రంగంలోకి దిగి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే సుస్మితా పటేల్ వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, తనకు షోకాజ్ నోటీసు జారీ చేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమంటూ సురేఖ వివరణ ఇచ్చారు. నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. దీనిని ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్యేలు తప్పుబట్టారు. సీఎం రేవంత్‌ను, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా సొంత కూతురు వ్యాఖ్యలు చేస్తే.. బాధ్యత గల మంత్రిగా ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. మంత్రి సురేఖ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ లైన్ తప్పితే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకోవాల్సిందేనని అధిష్ఠానాన్ని కోరారు. అయితే దీనిపై కొండా సురేఖ ఎదురుదాడికి దిగారు. తనపై మాట్లాడుతున్న ఎమ్మెల్యేల వెనుక అదృశ్య హస్తాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ శనివారం క్రమశిక్షణ కమిటీకి మరో లేఖ రాశారు. వాస్తవానికి కొండా సురేఖ, ఆమె కుటుంబం పదే పదే వివాదాలకు కేంద్రబిందువు అవుతుండడంపై అధిష్ఠానం ఆగ్రహంగా ఉంది.



ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించాలన్న ఆలోచన చేస్తోంది. అయితే పార్టీకి నష్టం జరగకుండా తమ నిర్ణయాన్ని ఎలా అమలు చేయాలన్న దానిపైనే తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయం కీలకంగా మారింది.

### సీఎం స్పందిస్తారా? లేదా?

కొండా సురేఖ ఎపిసోడ్‌పై ఈ సమావేశంలో స్పందిస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే మంత్రి కొండా సురేఖ సైతం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాతే ఈ అంశంపైన మాట్లాడతానని ఇప్పటికే చెప్పారు. ఇప్పుడు సీఎం రాక నేపథ్యంలో ఆమె కార్యాచరణ ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇప్పటికే పార్టీ ముఖ్యులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఆమె హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఆమె వచ్చిన తర్వాత ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పార్టీ ముఖ్య నాయకులతో భేటీ అయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఈ వివాదం నుంచి కొండా సురేఖను కాపాడేందుకు పార్టీలోని పలువురు సీనియర్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సీనియర్ నాయకుడి నేతృత్వంలో పరిశీలన కమిటీని నియమించి .. ఆ కమిటీ సిఫారసుల ఆధారంగా చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదన ముందుకు తెస్తున్నట్లు గాంధీ భవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## ‘22ఏ’ కారణంగా వేల కుటుంబాలు కన్నీరు

**హైదరాబాద్, ఆగస్టు 23 :** రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం చెప్పాలి. ప్రజల ఆస్తులను లాక్కుంటే చూస్తూ ఊరుకోబోం. భూభారతిలో నిషేధిత జాబితా కనిపించకుండా చేశారు. ప్రజలు తిరుగుబాటు చేయక ముందే ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. సెప్టెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాలలోపు 22ఏ భూములపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించకుంటే సమావేశాలను స్తంభింపజేస్తాం’ అని పేర్కొన్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితాపై ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, భారాస మీడియా సెల్ ప్రతినిధి క్రిశాంక్, సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ బుచ్చిరెడ్డి, తిరుమల మెడోస్ కాలనీ అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ దగాపై సమరభేరి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు వివరించాలన్నారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువత తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ‘బాకీ కార్డుల’రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. ఆయా వర్గాలకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, పేరుకుపోయిన బకాయిల వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కేవలం హామీలు అమలు కాలేదనే అంశానికే పరిమితం కాకుండా, 1,000 రోజుల పాలనలో ప్రభుత్వం వివిధ రంగాల్లో ఎదుర్కొన్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, గ్రామాలు, వార్డు స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను వివరించాలని పిలుపునిచ్చారు. కొత్త తరానికి చేరువయ్యేలా సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించి వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు సహా అన్ని స్థాయిల నాయకులు వారం రోజుల కార్యక్రమాల్లో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని కేటీఆర్ కోరారు.

## రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నాశనం

(మొదటిపేజీ తరువాయి)



అంటూ నిరసనలు చేస్తున్నారని, దమ్ముంటే హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి వస్తే విద్యార్థులు ఊరుకోరని, వారి కోసం ఇచ్చిన డిక్లరేషన్ అమలును కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మర్చిపోయిందని విమర్శించారు. ఆదివారం దిల్లీలో భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన జరిగిన పదాధికారుల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం తెలంగాణభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ‘రాష్ట్రంలో దాదాపు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. ఈ విషయంపై హైకోర్టు చివాట్లు పెడితే.. ఈ ఏడాదికి అడ్వాన్స్‌గా రూ.2,000 కోట్లు విడుదల చేస్తామని చెప్పింది. ఇంకా మంజూరు చేయలేదు. నిధులు విడుదల చేయాలని సోమ, మంగళ వారాలు హైదరాబాద్‌లో భాజపా కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తా’ అని స్పష్టం చేశారు. ‘గత భారాస ప్రభుత్వం కుటుంబ పాలనతో దోపిడీకి పాల్పడితే.. ప్రస్తుతం బ్రదర్స్ సర్కార్‌గా మారి దోపిడీ చేస్తోంది. గత ప్రభుత్వం 10 శాతం కమీషన్లు తీసుకుంటే, నేడు 30 శాతం తీసుకుంటున్నారు. 22ఏపేరుతో పేదల భూముల్ని దోచుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో భాజపాకు ప్రజలు ఓటేస్తారు’ అని రామచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. “ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 దాకా ‘మోదీ జీ సేవా సంకల్ప అభియాన్’ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. రక్తదాన శిబిరాలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తాం” అని పేర్కొన్నారు.



## 14 దేశాలకు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుల నియామకం

### పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటన

**హైదరాబాద్, ఆగస్టు 23 :** విదేశాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతం కోసం 14 దేశాల్లో పార్టీ అధ్యక్షులను నియమించినట్టు ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో కిశోర్ కత్తి (ఆస్ట్రేలియా), సుమన్‌రావు బల్మూరి (యూకే), వెంకట్రామన్ మెట్‌పల్లి (కెనడా), తానింకి కిశోర్ యాదవ్ (ఇటలీ), పింటూ ఘోష్ (మాల్టా), ప్రకాశ్ పొన్నకంటి (పోర్చుగల్), శేఖర్ గౌడ్ ఆరె (యూఏఈ), మార్క ప్రమోద్ గౌడ్ (కువైట్), బెమ్మడి మహేందర్ రెడ్డి (జింబాబ్వే), శేఖర్ చిలువూరి (ఖతార్), సందీప్ రెడ్డి ఐరెడ్డి (ఫిన్లాండ్), ప్రసాద్‌రావు బిక్కినేని (నార్వే), మొజ్జం అలీ ఇఫ్తేకర్ (సౌదీ అరేబియా), జయంత్ రెడ్డి మెట్టు (ఐర్లాండ్) వీరితోపాటు మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించినట్టు పేర్కొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయండి.. మళ్లీ సీఎంను చేస్తాం



(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైన సీపీఎస్ ఉద్యోగుల జనజాగరణ యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాలో కొనసాగింది. ఆదివారం ఎల్బీస్టేడియంలో జనజాగరణ యాత్ర ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కరువైందని, ఎన్నో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ‘రాష్ట్రంలో ఇప్పటికే 5 వేలకు పైగా ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. కానీ ఏ ఒక్కరికీ కూడా కనీసం రూ.5వేల పెన్షన్ కూడా రాలేదు. ఎక్కడో యుద్ధం జరిగితే తెలంగాణలోని సీపీఎస్ ఉద్యోగి ప్రాన్ అకౌంట్‌లో సొమ్ము ఆవిరి అవుతోంది. ఈ ఏడాది మార్చి నెలలో ఉద్యోగులతోపాటు ప్రభుత్వ సొమ్ము రూ.1,800 కోట్లు ఆవిరైంది. పాత పెన్షన్ విధానంలో ఉన్న మాదిరిగా కనీస పెన్షన్ హామీ కూడా లేకపోవడం దురదృష్టకరం’అని అన్నారు. ‘టీఎస్‌సీపీఎస్‌ఈయూ 12 ఏళ్లుగా పోరాటం చేసినందుకే ఇప్పుడు సీపీఎస్ ఉద్యోగులకు డెత్ కమ్ రిటైర్‌మెంట్ గ్రాడ్యుటీ (డీసీఆర్జీ) అమలవుతోంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారు. ఆయా రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ ఓపీఎస్ అమలు చేయాలి. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో డే అయిన నవంబర్ 17 నాటికి ప్రభుత్వం స్పందించి సీపీఎస్ రద్దుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి. ఒకవేళ స్పందించకుంటే నవంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ సామూహిక సెలవులు పెట్టాలి. జిల్లా కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలతో తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేయాలి’అని స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. 41 రోజుల పాటు 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనజాగరణ యాత్ర జరగ్గా, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతులు సమర్పించారు. ఆదివారం నాటి సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలివచ్చారు. సభ జరిగినంత సేపు వర్షం కురుస్తున్నా, ఉద్యోగులు సీపీఎస్ రద్దు చేయాలంటూ నినాదాలు చేస్తూ సభను ఉత్సాహంగా సాగించారు. ఈ సమావేశంలో సంఘ కోశాధికారి నరేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కూరకుల శ్రీనివాస్, మ్యాన పవన్, మల్లికార్జున్, పోల శ్రీనివాస్, కిరణ్ ,లింగమూర్తి, నరేందర్ రావు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పార్లమెంట్ సమావేశాలు!

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజన బిల్లు కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తుందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి సభ నిరవధికంగా వాయిదాపడి 11 రోజులైనా ఇంతవరకూ ముగింపు ప్రకటన వెలువడలేదు. అంటే వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ఆర్టికల్ 85(1) కింద జారీ చేసిన ఉత్తర్వులు ఇప్పటికీ అమల్లో ఉన్నట్లే లెక్క. సమావేశాలు ఇంకా ముగియలేదని దీని అర్థం. రాష్ట్రపతి మళ్లీ 85(1) కింద పిలుపు ఇవ్వాల్సిన అవసరం లేకుండానే పార్లమెంటు సమావేశం నిర్వహించే అధికారం పార్లమెంటరీ వ్యవహారాలశాఖకు ఉంటుంది. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. ప్రత్యేక సమావేశం నిర్వహించి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదించేందుకు హోం మంత్రి అమిత్ షా ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారా అని ఆయన ఎక్స్‌లో ప్రశ్నించారు. కానీ, ఈసారి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఆదివారం ఉదయం వరకు వర్షాకాల సమావేశాల ముగింపునకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ జారీ కాలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఏప్రిల్ 20న ప్రొరోగ్ చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు, ప్రొరోగ్ చేస్తారు. 2029 పార్లమెంటరీ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించే బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురావచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదింపజేయడానికి బడ్జెట్ సమావేశాల సమయంలోనే ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదు. ప్రభుత్వానికి అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో బిల్లు వీగిపోయింది. స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కోరవచ్చన్న సంకేతాలు కనిపించాయి. వర్షాకాల సమావేశాలు



ఇంకా అధికారికంగా ముగియని నేపథ్యంలో ఉభయ సభలను ప్రత్యేకంగా కొలువుదీర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడతారన్న ప్రచారం సాగుతోంది.



## పార్టీ లైన్ దాటి మాట్లాడితే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలన తర్వాత మంత్రి కొండా సురేఖపై చర్యలు ఉంటాయని మహేశ్‌గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్, భాజపాలా తమది నియంతృత్వ పార్టీ కాదన్నారు. మాట్లాడటానికి పార్టీలో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఉంటుందని.. కానీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే మాత్రం చర్యలు ఉంటాయని చెప్పారు. కొండా సురేఖ కుమార్తె వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. “ముందు పార్టీ.. ఆ తర్వాతే వ్యక్తులు. పార్టీని కాపాడే బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా లైన్ దాటి మాట్లాడితే చర్యలు తప్పవు. పార్టీ అంతర్గత వ్యవహారాలు ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతున్నాయి. కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు. చిన్నారెడ్డికి కూడా నోటీసు ఇచ్చారు. సురేఖపై ఏ నిర్ణయమైనా పార్టీ తీసుకుంటుంది” అని వాకిటి శ్రీహరి అన్నారు.



## ఖర్గేతో సురేఖ భేటీ?

(మొదటిపేజీ తరువాయి)

కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ రాష్ట్ర నాయకుల అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ వారు అందుబాటులోకి రాకపోవడంతో.. ఆమె బెంగళూరు వెళ్లి ఖర్గేను కలిశారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఆదివారం మధ్యాహ్నం సమయంలో సుమారు 15 నిమిషాలపాటు ఖర్గేతో ఆమె భేటీ అయినట్లు, తన కూతురు చేసిన వ్యాఖ్యల తర్వాత జరిగిన పరిణామాలను ఆయనకు వివరించినట్లు చెబుతున్నాయి. ఈ సందర్భంగా.. తాము కాంగ్రెస్ పార్టీని, గాంధీ కుటుంబాన్ని విమర్శించలేదని, కొందరు కావాలనే తమను టార్గెట్ చేశారని సురేఖ చెప్పినట్లు సమాచారం. ఖర్గే కూడా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఆరా తీసినట్లు, పార్టీకి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడటం మంచిది కాదని అన్నట్లు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇవ్వాలని సురేఖకు చెప్పగా.. ఇప్పటికే రెండుసార్లు వివరణ ఇచ్చానని ఆమె తెలిపినట్లు సమాచారం. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొద్దిగంటల్లో లండన్ నుంచి హైదరాబాద్‌కు చేరుకోనుండగా.. కొండా సురేఖ ఏఐసీసీ అధ్యక్షుడితో భేటీ కావడం హాట్ టాపిక్‌గా మారింది.

## ఐసీఎస్ఐ నూతన భవనం ప్రారంభం

### భవనాన్ని ప్రారంభిస్తున్న పవన్ జి.చందక్

**హైదరాబాద్, ఆగస్టు 23 :** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ నూతన భవనాన్ని సంస్థ జాతీయ అధ్యక్షుడు పవన్ జి.చందక్ ఆదివారం ప్రారంభించారు. ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో రూ.10కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా పవన్ జి.చందక్ మాట్లాడుతూ.. తెలంగాణలో కంపెనీ సెక్రటరీలు, విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నూతన భవనం వారికి మరింత మెరుగైన వేదికగా నిలుస్తుందన్నారు. ప్రొఫెషనల్, విద్యా కార్యక్రమాలతోపాటు వివిధ స్టేక్‌హోల్డర్లతో మరింత విస్తృతంగా అనుసంధానానికి హైదరాబాద్ చాప్టర్‌కు ఈ భవనం దోహదపడుతుందన్నారు. ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్‌లో 2,300 మంది సభ్యులు, 3 వేల మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. అంతర్జాతీయంగానూ ఐసీఎస్ఐ తన కార్యకలాపాలను విస్తరిస్తోందని, త్వరలో నెదర్లాండ్స్‌లో యూరోపియన్ యూనియన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. దేశంలో వ్యాపార సంస్థలకు సంబంధించిన నియంత్రణ, చట్టపరమైన అనుసరణ, కార్పొరేట్ గవర్నెన్స్ అవసరాలు పెరుగుతున్న కొద్దీ అర్హత కలిగిన కంపెనీ సెక్రటరీలకు అవకాశాలూ గణనీయంగా పెరుగుతున్నాయని అన్నారు.

ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్నారు ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య. నిత్యం ప్రజల మధ్యంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ 'ప్రజా నాయకుడు' అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.





# ప్రజా సమస్యలే ఊపిరిగా... ఆలేరు అభ్యున్నతే ధ్యేయంగా...

**ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రజాపాలన మార్గం**



## సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్ళుగా...

ఆలేరు నియోజకవర్గంలో వ్యవసాయం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల మెరుగుదలకు బీర్ల ఐలయ్య ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు:

**రైతాంగానికి అండ:** ఆలేరు ప్రాంతంలో తాగు, సాగునీటి ఎద్దడి లేకుండా చెరువులను నింపడం, కాలువల మరమ్మతులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా అధికారులతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నారు.

**మౌలిక వసతుల కల్పన:** గ్రామీణ రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలలు మరియు వైద్యశాలల్లో సౌకర్యాల పునర్నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

**ప్రజా దర్బార్:** నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తూ, అక్కడికక్కడే పరిష్కారాలు చూపేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల సంక్షేమమే పరమావధిగా ముం దుకు సాగుతున్నారు ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య. నిత్యం ప్రజల మధ్యంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ 'ప్రజా నాయకుడు' అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

### సామాన్య కార్యకర్త స్థాయి నుండి శాసనసభ్యుడిగా...

సామాన్య నేపథ్యం నుండి వచ్చి, ప్రజా క్షేత్రంలో నిరంతరం పోరాటాలు చేస్తూ నాయకుడిగా ఎదిగిన తీరు ప్రశంసనీయం. స్థానిక సమస్యలపై స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉన్న అనుబంధమే ఆయనను ఈ రోజు ఆలేరు ప్రతినిధిగా నిల బెట్టింది. అధికారాన్ని బాధ్యతగా భావిస్తూ, నియోజకవర్గ మూలమూలలా అభివృద్ధి ఫలాలు అందించడానికి శ్రమిస్తున్నారు.



**మనం జనం పత్రిక ప్రత్యేక కథనం**

### యాదాద్రి పుణ్యక్షేత్రం - ఆధ్యాత్మిక అభివృద్ధి

ఆలేరు నియోజకవర్గానికి తలమానికమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధి, చుట్టుపక్కల ప్రాంతాల పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. స్థానిక వ్యాపారులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తూనే, నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. పదవులు తాత్కాలికం, ప్రజల గుండెల్లో సంపాదించుకునే స్థానమే శాశ్వతం అని నమ్మే బీర్ల ఐలయ్య నాయకత్వంలో ఆలేరు నియోజకవర్గం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందనడంలో సందేహం లేదు.









## ఆర్‌బీ పవర్ సెంటర్ నూతన కార్యాలయం ప్రారంభం

**ఉప్పల్:** ఈసీఐఎల్ సమీపంలోని కుషాయిగూడ ఇండస్ట్రి యల్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఆర్‌బీ పవర్ సెంటర్ నూతన కార్యాలయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోమశేఖర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుల కుటుంబ సభ్యులు, సిబ్బంది, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



## సోలిస్ హాస్పిటల్స్ చైర్మన్ రాముకు జన్మదిన శుభాకాంక్షలు

**ఉప్పల్:** సోలిస్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాము జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిల్లి సాయిరాం గంగపుత్ర ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ రాము ఆధ్యాత్మిక భావాలు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా ప్రజలకు సేవ చేయడంతో పాటు ఇతరులను ప్రోత్సహిస్తూ ఉంటారని అన్నారు. ఆయన సేవా భావం, మానవత్వం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాము ఆయురారో గ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



## రక్తదానం.. మరొకరికి జీవనదానం

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

**ఉప్పల్:** బ్రహ్మకుమారీస్ కళ్యాణపురి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సల్ బ్రదర్‌హుడ్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ 19వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారిని ఆయన అభినందించారు. రక్తదానం ఒకరి ప్రాణాన్ని కాపాడుతుందని, ముఖ్యంగా యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళ్యాణపురి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్, ప్రధాన కార్యదర్శి గణేష్, బ్రహ్మకుమారీస్ సభ్యులు పాల్గొన్నారు.



## కెపిహెచ్‌బిలో బిసి నాయకుల సమావేశం

### ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

**కూకట్ పల్లి, ఆగష్టు23, (జనం వార్త) :** కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని స్థానిక బిసి నాయకులు కేపీహెచ్ బి కాలనీ లో శనివారం సాయంత్రం నిర్వహించారు. కేపీహెచ్ బి కాలనీ ఏడవ ఫేజ్ బాస్కెట్ బాల్ గ్రౌండ్ లో నిర్వహించిన ఈ సమావేశానికి యు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పలు అంశాలపై చర్చించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బిసి కుటుంబానికి 120 గజాల స్థలాన్ని ప్రభుత్వ ధరకే అందించాలని డిమాండ్ చేశారు. బిసి వృద్ధుల వృద్ధాశ్రమం కోసం వేయి గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని, అందులో శుభకార్యాలు నిర్వహించడానికి కమ్యూనిటీ హాల్ ను నిర్మించాలనిఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల కోసం ప్రభుత్వ పథకాలను అర్హులైన బీసీలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సభ్యులు సూచించారని, త్వరలో నిర్ణయం తీసుకొని ప్రకటిస్తామని తెలిపారు.

### ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

నూతన కమిటీఅధ్యక్షులుగా అంజిబాబు, ప్రధాన కార్యదర్శి గా యు.శివప్రసాదు ఉపాధ్యక్షులుగా వై రాజు, శ్యామ్ సుందర్, సంయుక్తకార్యదర్శి గా కే.నర్సింగరావు, కే రోహిత్ కుమార్, కార్య నిర్వహక కార్యదర్శి గాశ్రీ ధర్ చారి, గౌరవ అధ్యక్షులుగా స్వామి గౌడ్, సలహాదారులుగా విద్యా వెంకట్, వీ. హేమ సుందర్, కోశాదికారిగా విద్య అశోక్ ఎన్నికయ్యారు. కమిటి సభ్యులుగాసాంబయ్య, వెంకటరమణ,శరత్ బాబు, పాండురంగాచారి,బుచ్చయ్య,వీరాస్వామి, శ్రీనివాస్, దశరథ్ కుమార్, కనకరాజు, సుధాకర్, ఫణిబాబు,యుగంధర్,బ్రహ్మ నందము, యం.వి. ఫణిబాబు,వెంకటయ్యలు ఉన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం ఎందుకు దక్కడం లేదు?

**ఉద్యమాలు ఎన్నో... నినాదాలు ఎన్నో... సభలు, సమావేశాలు ఎన్నో... కానీ బీసీలకు రాజకీయ రాజ్యాధికారం మాత్రం ఎందుకు దూరంగానే ఉంది? తెలంగాణలో బీసీ హక్కుల కోసం గత కొన్ని సంవత్సరాలుగా అనేక వేదికలపై ఉద్యమాలు కొనసాగుతున్నాయి. రిజర్వేషన్లు, జనాభా లెక్కలు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై బీసీ సంఘాలు, నాయకులు తమ గళాన్ని వినిపిస్తున్నారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం 29 శాతం రిజర్వేషన్ ఉండగా, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ ఉన్నట్లు తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.**

అయితే అసలు ప్రశ్న మాత్రం ఇంకా అలాగే ఉంది. బీసీలు జనాభాలో పెద్ద వర్గంగా ఉన్నప్పటికీ, రాజకీయ నిర్ణయాధికారంలో అదే స్థాయిలో ఎందుకు కనిపించడం లేదు?

### ఉద్యమం ఉంది... కానీ రాజకీయ లక్ష్యం ఉందా?

బీసీ ఉద్యమం కేవలం రిజర్వేషన్ల కోసం మాత్రమే పరిమితం అయితే అది ఒక హక్కుల ఉద్యమంగా మిగిలిపోతుంది. కానీ బీసీలకు నిజమైన రాజకీయ శక్తి రావాలంటే గ్రామస్థాయి నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ వరకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం పెరగాలి. బీసీల పేరుతో ఉద్యమాలు చేస్తున్న ప్రతి నాయకుడి లక్ష్యం నిజంగా బీసీల రాజకీయ సాధికారతేనా? లేక ఉద్యమాన్ని ఒక రాజకీయ వేదికగా ఉపయోగించుకుని వ్యక్తిగత రాజకీయ ఎదుగుదలకు ప్రయత్నిస్తున్నారా? అనే ప్రశ్నను బీసీ సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

### ఉద్యమం పార్టీల మెట్లుగా మారితే?

ఏ ఉద్యమమైనా అధికారంలో ఉన్న పార్టీలను ప్రశ్నించాలి. ప్రతిపక్ష పార్టీలను కూడా ప్రశ్నించాలి. అవసరమైతే అన్ని పార్టీలపై ఒకే ప్రమాణంతో ఒత్తిడి తీసుకురావాలి. కానీ ఒక నాయకుడు ఒక పార్టీని ప్రశ్నిస్తూ మరో పార్టీ దగ్గరకు వెళ్లి రాజకీయ ప్రయోజనం పొందితే, లేదా పార్టీ ప్రయోజనాల కోసం ఉద్యమం యొక్క ప్రధాన లక్ష్యాలను పక్కన పెడితే, ఉద్యమం బలహీనపడే ప్రమాదం ఉంటుంది. ఉద్యమ నాయకుడు పార్టీకి విధేయుడా? లేక ఉద్యమానికి విధేయుడా? ఈ ప్రశ్నకు సమాధానం చాలా కీలకం.

### బీసీల మధ్య ఐక్యత లేకపోవడం మరో పెద్ద సవాలు

బీసీ వర్గంలోనే అనేక కులాలు, ఉపవర్గాలు ఉన్నాయి. ప్రతి వర్గానికి తనదైన సమస్యలు, అవసరాలు ఉన్నాయి. ఈ వైవిధ్యాన్ని రాజకీయ బలంగా మార్చుకోవాల్సిన చోట, పరస్పర విభేదాలు పెరిగితే మొత్తం బీసీ సమాజం రాజకీయంగా నష్టపోతుంది. ఒకరి నాయకత్వాన్ని మరొకరు అంగీకరించకపోవడం, వ్యక్తిగత ఆధిపత్య పోటీలు, చిన్న చిన్న రాజకీయ విభేదాలు---ఇవి ఉద్యమాన్ని బలహీనపరచగలవు. బీసీల సంఖ్యను ఓటు శక్తిగా మాత్రమే కాకుండా, సంఘటిత రాజకీయ శక్తిగా మార్చాల్సిన అవసరం ఉంది.

### రాజ్యాధికారం అంటే కేవలం ముఖ్యమంత్రి పదవి కాదు

రాజ్యాధికారం అంటే ఒక వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మాత్రమే కాదు. గ్రామ పంచాయతీ నుంచి మండలం వరకు, జిల్లా పరిషత్ నుంచి మున్సిపాలిటీ వరకు, అసెంబ్లీ నుంచి పార్లమెంట్ వరకు---ప్రతి స్థాయిలో విధాన నిర్ణయాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఉండటం. అందుకు విద్య, ఆర్థిక బలం, రాజకీయ అవగాహన, సంఘటిత శక్తి, నాయకత్వ నిర్మాణం---అన్నీ అవసరం.




మరి పరిష్కారం ఏమిటి?
బీసీ ఉద్యమం నిజంగా రాజ్యాధికార దిశగా వెళ్లాలంటే కొన్ని ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కావాలి.
బీసీల రాజకీయ ప్రాతినిధ్యం ఎంత?
ఎన్ని స్థానాల్లో బీసీ నాయకత్వాన్ని బలపరచాలి?
యువతకు రాజకీయ శిక్షణ ఎవరు ఇస్తారు?
బీసీ కులాల మధ్య ఐక్యత ఎలా సాధించాలి?
ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఐదేళ్లు ఉద్యమం ఎలా కొనసాగాలి?
ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకకుండా కేవలం సభలు, సమావేశాలు, నినాదాలతో రాజ్యాధికారం సాధించడం కష్టం.
తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ స్థాయిలో కూడా చర్యలు, చర్చలు జరిగాయి. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ప్రత్యేక కమిషన్ ద్వారా సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేయాల్సిన న్యాయపరమైన ప్రక్రియ కూడా ఉంది.

చివరి మాట బీసీలకు రాజ్యాధికారం ఎవరో ఇచ్చేది కాదు... బీసీలు తమ రాజకీయ శక్తిని తాము నిర్మించుకోవాల్సిందే.
అందుకోసం ఉద్యమం వ్యక్తుల చుట్టూ కాకుండా విధానాల చుట్టూ ఉండాలి.
పార్టీల చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ ఉండాలి.
వ్యక్తిగత రాజకీయ ఎదుగుదల కోసం కాకుండా తరతరాల బీసీ భవిష్యత్తు కోసం ఉండాలి.
ఎవరు ఏ పార్టీలో ఉన్నారన్నది కంటే---
బీసీల హక్కుల కోసం ఎవరు నిలబడుతున్నారు?
ఎవరు ప్రశ్నిస్తున్నారు?
ఎవరు రాజీపడకుండా పోరాడుతున్నారు?
ఎవరు బీసీ సమాజాన్ని ఐక్యం చేస్తున్నారు?
అన్నదే ప్రజలు నిర్ణయించాలి.
ఉద్యమం నినాదంగా మిగిలిపోతే మార్పు రాదు.
ఉద్యమం రాజకీయ చైతన్యంగా మారితేనే రాజ్యాధికారానికి దారి తెరుచుకుంటుంది.
ఇది ఎవరి మీద విమర్శ కాదు... బీసీ సమాజం తనను తాను ప్రశ్నించుకోవాల్సిన సమయం.

# పాపన్న స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

- గీత కార్మికుల సంక్షేమ హామీలను ప్రభుత్వం అమలు చేయాలి
- 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి పింఛన్ అందించాలి
- జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి
- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ



**దేవరుప్పుల:** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో గీత కార్మికులు సంఘటితమై తమ హక్కులను సాధించుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల వెంకటరమణ పిలుపునిచ్చారు. దేవరుప్పుల మండ లం చిన్నమడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆదివారం ముఖ్య అతిథులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. చిన్నమడూరు టీసీఎస్ అధ్యక్షుడు బుషిగంపల నరేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సామాన్యుడిగా జీవితం ప్రారంభించి అణగారిన వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని సాధించిన పాపన్న జీవితం నేటితరానికి ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ శ్రామిక, బహుజన రాజ్య స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వృత్తిపరమైన ప్రమాదాలకు గురైన గీత కార్మికుల కుటుంబాలకు సంబంధించిన రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా మూడేళ్లుగా పెండింగ్‌లో ఉందని, సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరంతర పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ఈ నెల 18న బాధితులకు ఆ మొత్తాన్ని విడుదల చేసిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులందరికీ పింఛన్ మంజూరు చేయడంతోపాటు వృత్తిలో ఉన్న ప్రతి కార్మికుడికి 'కాటమయ్య రక్షణ కవచం' అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన హామీని తక్షణమే కార్యరూపంలోకి తీసుకురావాల న్నారు. గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందించడం, వృత్తిలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టడం వంటి అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను సైతం అమలు చేయాలని కోరారు. కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతి గీత కార్మిక సహకార సంఘానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. నందనంలోని నీరా, తాటి--ఈత ఉత్పత్తుల ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలన్నారు. గీత కార్మికుల నెలవారీ పింఛన్‌ను రూ.4 వేలకు, వృత్తిపరమైన ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టడంతోపాటు ఆయన పాలించిన కోటలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. పాపన్న చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భావితరాలకు ఆయన పోరాట స్ఫూర్తిని పరిచయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రజ ఆస్పత్రి ఎండీ శ్రీగ విజయ్‌కుమార్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకట మల్లయ్య, వి.వెంకట నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, ఆర్టీఏ సభ్యుడు అబ్బిగౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పరిదల భాస్కర్, మండల కార్యదర్శి ఉడుగుల ప్రభాకర్, దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

మనం ఆహారంగా తీసుకునే కూరగాయలల్లో క్యారెట్స్ కూడా ఒకటి. ఇవి నారింజ రంగుతో పాటు తెలుపు, పసుపు, ఊదా, ఎరుపు రంగుల్లో కూడా లభిస్తూ ఉంటాయి. ఇవి తియ్యటి రుచిని కలిగి ఉ ంటాయి. క్యారెట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో బీటా కెరోటీన్ తో పాటు ఫైబర్, విటమిన్ కె1, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. కొవ్వు, కేలరీలను ఇవి తక్కువగా కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. క్యారెట్ లను మనం ఆహారంలో భాగంగా తరచూ తీసుకుంటూ ఉంటాము. క్యారెట్ లను వంటలల్లో వాడడంతో పాటు వీటిని జ్యూస్ గా చేసి ఉదయం పూట అల్పాహారంలో భాగంగా తీసుకోవడం వల్ల కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అల్పాహారంలో భాగంగా క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



# క్యారెట్ జ్యూస్‌తో ఆరోగ్యానికి మేలు

## రోజూ బ్రేక్‌ఫాస్ట్‌లో తాగితే మంచిదంటున్న నిపుణులు

### కంటి సమస్యలకు..



క్యారెట్ లు బీటా కెరోటీన్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఈ బీటా కెరోటీన్ మన శరీరంలోకి ప్రవేశించిన తరువాత ఇది విటమిన్ ఎ మార్చబడుతుంది. విటమిన్ ఎ మన కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో సహాయపడుతుంది. క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల దృష్టి లోపాలు తగ్గుతాయి. క్యారెట్ జ్యూస్ లో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు విటమిన్ సి కూడా ఉంటుంది. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. తద్వారా శరీరం ఇన్ఫెక్షన్ లబారిన పడే అవకాశాలు తగ్గుతాయి. అల్పాహారంలో క్యారెట్ జ్యూస్ ను చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. క్యారెట్ లలో పొటాషియం, విటమిన్ కె వంటి పోషకాలు ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. క్యారెట్ జ్యూస్ లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తోడ్పడతాయి. దీంతో వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మంపై మొటిమలు, మచ్చలు వంటి సమస్యలు కూడా రాకుండా ఉంటాయి.

### జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా క్యారెట్ జ్యూస్ మనకు సహాయపడుతుంది. క్యారెట్ జ్యూస్ లో ఫైబర్ అధికంగా ఉ ంటుంది. ఇది పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో దోహదపడుతుంది. ఇక క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. కాలేయంలో ఉండే వ్యర్థాలు, విష పదార్థాలు తొలగిపోతాయి. ఉదయం పూట అల్పాహారంలో భాగంగా క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల మెదడు చురుకుగా పని చేస్తుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు విటమిన్ ఇ కూడా ఉంటుంది. ఇవి మెదడు కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. దీంతో మెదడు ఆరోగ్యంతో పాటు అభిజ్ఞా పనితీరు కూడా మెరుగుపడుతుంది. దంతాలు, చిగుళ్ల సమస్యతో బాధపడే వారు క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ జ్యూస్ లో క్యాల్షియం, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి దంతాలను దృఢంగా చేయడంతో పాటు చిగుళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి.

### బరువు తగ్గేందుకు..



బరువు తగ్గాలనుకునే వారు క్యారెట్ జ్యూస్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. దీనిలో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు క్యారెట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గవచ్చు. ఇక ప్రాణాంతకమైన క్యాన్సర్ ముప్పును తగ్గించడంలో కూడా క్యారెట్ మనకు దోహదపడుతుంది. క్యారెట్ జ్యూస్ లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ తో పోరాడి క్యాన్సర్ ముప్పును తగ్గిస్తాయి. ఈ విధంగా క్యారెట్ జ్యూస్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని నేరుగా తీసుకోవడంతో పాటు ఈ క్యారెట్ లకు పాలకూర, అల్లం, ఆపిల్ వంటి వాటిని కలిపి జ్యూస్ గా చేసి కూడా తీసుకోవచ్చు. ముఖ్యంగా చలికాలంలో ఈ జ్యూస్ ను తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.

---

వంటలు చేయడానికి సాధారణంగా మనం వాడే పదార్థాల్లో నూనె కూడా ఒకటి. భారతీయ వంటకాల్లో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. పప్పు, పచ్చడి, పులుసు, కూర ఎలా ఏ వంటకాలు చేసినా మనం నూనెను ఉపయోగిస్తూ ఉంటాం. అలాగే మనం తినే చాలా రకాల చిరుతిండ్లు నూనెలో వేయించినవే. ఇక కొన్ని వంటకాలను డీప్ ఫ్రై చేస్తూ ఉంటాము. అలాగే వివిధ రకాల చిరుతిళ్లను కూడా నూనెలో వేసి వేయించి తింటూ ఉంటాం. వంటకాలు పూర్తి అయిన తరువాత ఈ డీప్ ఫ్రైకు వాడిన నూనెను చాలా మంది నిల్వ చేసుకుని మరలా ఉపయోగిస్తూ ఉంటారు. ఈ విధంగా మనలో చాలా మంది చేస్తూ ఉంటారు. అయిన వాడిన నూనెను తిరిగి వాడడం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. భారతదేశంలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. కనుక నూనెను తిరిగి వాడడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు.



### వీటిని వాడితే మంచిది..

పొట్ట, గుండెతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా తీవ్ర హాని కలుగుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. కనుక వాడిన నూనెను మరలా వాడకపోవడమే మంచిదని వారు సలహా ఇస్తున్నారు. అలాగే చాలా మంది వంటల్లో పొద్దుతిరుగుడు నూనెను వాడుతూ ఉంటారు. దీనికి బదులుగా పల్లి నూనె, ఆవాల నూనె, కొబ్బరి నూనె, నెయ్యి వంటి వాటిని ఉపయోగించడం మంచిదని అలాగే నెలకొకసారి తీసుకునే నూనెలను మార్చాలని వారు చెబుతున్నారు. ఏదో ఒకే రకమైన నూనెపై అతిగా ఆధారపడడం కూడా మంచిది కాదని వారు సూచిస్తున్నారు.

# వేడి చేసిన వంట నూనెలను మళ్లీ ఉపయోగిస్తున్నారా..?

## అయితే అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటునట్లే..



నూనెను పదే పదే వేడి చేయడం వల్ల వాటిలో విష పదార్థాలు ఏర్పడ తాయి. ఇవి శరీరంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని తీవ్రమైన దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడేలా చేస్తాయని వారు తెలియజేస్తున్నారు. భారతీయుల ఇండ్లల్లో నూనెను మరలా మరలా వాడడం మనం చూస్తూనే ఉంటాం. ఇలా చేయడం వల్ల కొవ్వు ఆమ్లాలు విచ్ఛనమై ఫ్రీరాడికల్స్ ను విడుదల చేస్తాయి. నూనెను ఎంత ఎక్కువగా వేడి చేస్తే ఫ్రీరాడికల్స్ అంత ఎక్కువగా విడుదల అవుతాయి. ఫ్రీరాడికల్స్ శరీరం పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ ను పెంచడంలో, ట్రైగ్లిజరైడ్స్ ను పెంచడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని పెంచడంలో, వాపులను ప్రేరేపించడంలో, ఇన్సులిన్ నిరోధకతను పెంచడంలో ఫ్రీరాడికల్స్ పాత్ర ఎంతో ఉంది. కాలక్రమేణా ఇది గుండె జబ్బులు, డయాబెటిస్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ వంటి వ్యాధులకు దారి తీస్తుంది.

### ఈ తప్పు చేయవద్దు..

అలాగే కొందరు వాడిన నూనెను నిల్వ చేయడంలో కూడా తప్పులు చేస్తూ ఉంటారు. వాడిన నూనెపై మూత ను సరిగ్గా ఉంచరు. దీని వల్ల ఆక్సీకరణం త్వరగా జరిగి ఫ్రీరాడికల్స్ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. కనుక వాడిన నూనెను మూత ఉంచిన డబ్బాలో పోసి చల్లటి, చీకటి ప్రదేశాల్లో ఉంచి మాత్రమే నిల్వ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆక్సీకరణ తగ్గుతుంది. ఫ్రీరాడికల్స్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇక వాడిన నూనెను మరలా వాడాలి అనుకునే వారు దీనిని తాజా నూనెతో కలిపి వాడడం మంచిది. ఇలా చేయడం వల్ల నూనె ఎక్కువగా విషపూరితం అవ్వదు. కానీ దానిలో ఉండే హానికారక సమ్మేళనాలు తగ్గవు. నూనెను మరలా వాడడం వల్ల దానిలో ఉండే పోషకాలు కూడా తగ్గుతాయి.



## వేసవికాలంలో

# కొబ్బరినీళ్లను తాగాల్సిందే..

**వేసవికాలం అనగానే మండే ఎండ, అధిక చెమట, అలసట, నీరసం వంటి సమస్యలు గుర్తుకు వస్తాయి. వేసవికాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం చాలా అవసరం. చెమట ద్వారా శరీరం ద్రవాలను ఎక్కువగా కోల్పోతుంది. దీని వల్ల డీహైడ్రేషన్ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీర్ణక్రియ సరిగ్గా జరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. మెదడు పనితీరు కూడా మెరుగుపడుతుంది. కనుక వేసవిలో ద్రవాలతో పాటు ద్రవాలు ఉన్న ఆహారాలను తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ముఖ్యంగా బయట ఎక్కువగా పనిచేసే వారు ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలి. అయితే చక్కెరలు ఎక్కువగా ఉండే శీతల పానీయాల కంటే కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.**

### డీహైడ్రేషన్ రాకుండా..

కొబ్బరినీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గడంతో పాటు శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి అందుతాయి. ఇది సహజమైనది, ఇందులో క్యాలరీలు కూడా తక్కువగా ఉంటాయి. వేసవికాలంలో కొబ్బరి నీటిని తాగడం వల్ల కలిగే ఆరోగ్యకరమైన ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగిన తరువాత కొబ్బరి నీటిని తీసుకోవడం మంచిది. చెమట కారణంగా శరీరం ముఖ్యమైన ఖనిజాలను కోల్పోతుంది. కొబ్బరి నీటిని తాగడం వల్ల పొటాషియం, సోడియం, మెగ్నీషియం, క్యాల్షియం వంటి ఎలక్ట్రోలైట్స్ తిరిగి శరీరానికి అందుతాయి. శరీరంలో ద్రవసమతుల్యం పునరుద్దరించడంతో పాటు కండరాల నొప్పులు తగ్గుతాయి. కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి. అలసట, చర్మంపై రాషెస్, తలనొప్పి వంటి ఎండ సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

### కిడ్నీ స్టోన్లకు పరిష్కారం..

వేసవిలో జీర్ణక్రియ సమస్యలు తలెత్తడం సహజం. కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల దీనిలో ఉండే బయోఆక్టివ్ ఎంజైమ్స్, సహజ ఆల్కలైన్ గుణాలు జీర్ణాశయానికి ఉపశమనాన్ని కలిగిస్తాయి. దీంతో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు తగ్గుతాయి. వేసవికాలంలో శక్తిని త్వరగా కోల్పోతూ ఉంటారు. అటువంటి సమయంలో కొబ్బరి నీటిని తాగడం వల్ల దీనిలో ఉండే సహజ చక్కెరలు, మెగ్నీషియం శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి. కొబ్బరి నీరు సహజంగానే డయురెటిక్ గా పని చేస్తుంది. ఇది మూత్రవిసర్జనను పెంచి శరీరంలో విషాలను, వ్యర్థపదార్థాలను బయటకు పంపుతుంది. దీంతో మూత్రపిండాల్లో రాళ్ల వంటి సమస్యలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా తయారవుతుంది. కొబ్బరి నీటిలో విటమిన్ సి, విటమిన్ బి, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన



పోషకాలు ఉంటాయి. ఇవి శరీరం మొత్తం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

### గుండె ఆరోగ్యానికి..

కొబ్బరి నీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది. కనుక ఈ నీటిని తాగడం వల్ల బీపీ అదుపులో ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విధంగా కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీరు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ వీటిని కూడా మితంగా తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాధులు, క్రానిక్ కిడ్నీ డిసీజ్, అధిక రక్తపోటు, పొటాషియం ఉన్న ఆహారాలను మితంగా





# నిద్రలేమితో ముందస్తు మధుమేహం



నిద్ర సరిగా పట్టక ఇబ్బంది పడుతున్నారా? అయితే వెంటనే సరిచేసుకోండి. ఎందుకంటే నిద్రలేమి మూలంగా ఆరోగ్యవంతులు రాత్రికి రాత్రే ముందస్తు మధుమేహం (ప్రిడయాబిటీస్) బారినపడే అవకాశమున్నట్టు జర్నల్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురితమైన దీర్ఘకాల అధ్యయనం హెచ్చరిస్తోంది. ముందస్తు మధుమేహంలోనూ రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి. కాకపోతే మధుమేహంగా గుర్తించేంత స్థాయిలో ఉండవు. ఇది మున్ముందు పూర్తిస్థాయి మధుమేహంగా మారే ప్రమాదముంది. కాబట్టి కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు. వేళకు పడుకోకపోవటం, రాత్రిపూట తరచూ మెలకువ రావటం, నిద్ర సరిగా పట్టకపోవటం మూలంగా గ్లూకోజు మోతాదులను నియంత్రించే హార్మోన్లు అస్తవ్యస్త మవుతాయి. దీంతో పరగడుపున రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి. ఇన్సులిన్ హార్మోన్‌కు కణాలు స్పందించటమూ తగ్గుతుంది. దీంతో కణాల్లోకి గ్లూకోజు సరిగా వెళ్లదు. ఇది రక్తంలోనే ఉండిపోతుంది.




# పడిక్కల్ శతకం..




**భారత్ 300/5**
**శ్రీలంకతో రెండో టెస్టు**



**కొలంబో :** దేవ్‌దత్ పడిక్కల్ (117; 193 బంతుల్లో 12x4) మరోసారి విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అతడితో పాటు కెప్టెన్ గిల్ (50; 108 బంతుల్లో 6x4), యశస్వి జైస్వాల్ (45; 53 బంతుల్లో 9x4), రవీంద్ర జడేజా (43; 83 బంతుల్లో 4x4) రాణించడంతో శ్రీలంకతో రెండో టెస్టులో తొలి రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. భారత్ మెరుగ్గానే ఉన్నప్పటికీ.. పరిస్థితి శ్రీలంక చేయి దాటి పోలేదు. సగం వికెట్లు తీసిన ఆతిథ్య జట్టు పోటీలో ఉంది. రెండో రోజు ఎన్ని పరుగులు చేస్తుందన్నదానిపైనే మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించడం ఆధారపడి ఉంది. జురెల్ (7)తో పాటు అరంగేట్ర ఆటగాడు సారాంశ్ జైన్ (4) క్రీజులో ఉన్నాడు. తొలి రోజు రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. రెండో రోజు బ్యాటింగ్‌కు రానున్నాడు.

### పడిక్కల్ అదరహో..:

మొదటి రోజును టీమ్‌ఇండియా సంతృప్తిగా ముగించిందంటే ప్రధాన కారణం దేవ్‌దత్ పడిక్కలే. తొలి వికెట్ త్వరగానే పోవడంతో క్రీజులోకి వచ్చిన పడిక్కల్ చక్కని ఇన్నింగ్స్ ఆడాడు. తొలి టెస్టులోలా దూకుడుగా ఆడకుండా.. వేడి, ఉక్కపోత పరిస్థితుల్లో సహనంగా, పట్టుదలగా నిలిచాడు. బౌన్స్ అందించిన ఎస్ఎస్‌సీ పిచ్‌పై లంక పేసర్ల షార్ట్ బంతులను సమర్థంగా ఎదుర్కొన్నాడు. బౌన్స్‌తో కూడిన స్పిన్నర్ల టర్న్‌కూ అతడు పడలేదు. అయితే 0, 1 వద్ద లంక ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన పడిక్కల్.. అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. 90 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత మరింత పట్టుదలగా ఆడాడు. టీ తర్వాత సెంచరీ (168 బంతుల్లో) పూర్తి చేశాడు. అయితే కాసేపటి తర్వాత నువంత బౌలింగ్‌లో వెనుదిరిగాడు. పడిక్కల్ నాలుగో వికెట్‌గా పెవిలియన్ చేరేటప్పటికి భారత్ స్కోరు 281. అతడు గిల్‌తో మూడో వికెట్‌కు 120, జడేజాతో నాలుగో వికెట్‌కు 74 పరుగులు జోడించాడు.

### రాణించిన గిల్, జడేజా:

తొలి రోజు గిల్, జడేజాలవి కూడా కీలక ఇన్నింగ్స్‌లే. టీమ్‌ఇండియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. ఓపెనర్ రాహుల్ (18) త్వరగానే వెనుదిరిగాడు. జట్టు స్కోరు 37 వద్ద కుమార బౌలింగ్‌లో అతడు ఔటయ్యాడు. మరో ఓపెనర్ జైస్వాల్ మాత్రం దూకుడు ప్రదర్శించాడు. చక్కని షాట్లతో అలరించాడు. చకచకా బౌండరీలతో వేగంగా పరుగులు రాబట్టాడు. కానీ పెద్ద ఇన్నింగ్స్ ఆడేలా కనిపించిన అతడు.. తర్వాతి బంతికే ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గిల్ సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. పడిక్కల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ముచ్చటైన షాట్లతో అలరించిన గిల్.. 99 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. కానీ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశలో అసిత బౌలింగ్‌లో వెనుదిరిగాడు. కాసేపటికే పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో టీమ్‌ఇండియా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంది. కుమార షార్ట్ బంతి పంత్ చేతికి బలంగా తగిలింది. పంత్ మైదానాన్ని వీడే సమయానికి జట్టు స్కోరు 207. ఆ దశలో వెటరన్ ఆల్‌రౌండర్ జడేజా నిలబడ్డాడు. పడిక్కల్‌కు సహకరించి, ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. చివరికి అతడు అసిత బౌలింగ్‌లో బౌల్డయ్యాడు.

## డబ్ల్యూటీసీ టేబుల్..

**ఆసీస్‌దే అగ్రస్థానం.. భారత్‌కు ప్రయోజనం**



బంగ్లాదేశ్‌పై భారీ విక్టరీ సాధించిన ఆస్ట్రేలియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలోనూ అదరగొట్టేసింది. తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ పర్సంటేజీని పెంచుకుంది. ఈ మ్యాచ్ ముందు వరకూ ఆసీస్ ఖాతాలో 84 పాయింట్లు.. 77.78 శాతం ఉండేది. విజయం అనంతరం 96 పాయింట్లకు చేరుకుంది. పర్సంటేజీ కూడా 80 శాతం అయింది. మరోవైపు దారుణమైన పరాభవం చవిచూసిన బంగ్లాదేశ్ 66.67 శాతం నుంచి 55.56 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం బంగ్లా ఖాతాలో 40 పాయింట్లు ఉన్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో (2025-27) భారత్ 53.33 శాతంతో ఐదో స్థానంలో ఉంది. అంటే, బంగ్లా కంటే పర్సంటేజీ కాస్త మాత్రమే తక్కువ. ఇప్పుడు శ్రీలంకతో టీమ్‌ఇండియా రెండో టెస్టు ఆడుతోంది. ఇందులో గెలిస్తే నాలుగో ప్లేస్‌కు చేరుకొనేందుకు అవకాశం ఉంది. అలాగే న్యూజిలాండ్ (72.22 శాతం)కు చేరువగా రావచ్చు. డబ్ల్యూటీసీ ఫైనల్‌లో అడుగు పెట్టాలని భావిస్తోన్న భారత్‌కు బంగ్లా పరాజయం కలిసొచ్చింది. ఇక లంకను ఓడిస్తే ముందుకు రావడం ఖాయం.

# ప్రతీకారం తీర్చుకున్న ఆసీస్

### బంగ్లాపై ఇన్నింగ్స్ తేడాతో విజయం

గాయపడిన సింహంలా ఆస్ట్రేలియా ప్రత్యర్థిపై విరుచుకుపడింది. సొంతగడ్డపై జరిగిన ఘోర అవమానానికి ప్రతీకారం తీర్చుకుంది. తమతో వ్యవహారం ఆషామాషీగా ఉండదని మరోసారి నిరూపించింది. తొలి టెస్టులో సంచలన విజయం నమోదు చేసిన బంగ్లాదేశ్‌కు అసలైన సవాల్ ఎలా ఉంటుందో రుచి చూపించింది. రెండో మ్యాచ్‌లో ఏకంగా ఇన్నింగ్స్ తేడాతో బంగ్లాను మట్టికరిపించింది. స్వల్ప స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్ కేవలం రెండో రోజు సెకండ్ సెషన్ తొలి ఓవర్‌లోనే ముగియడం గమనార్హం. బౌలర్లు ప్రభావం చూపించిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాను 64 పరుగులకే ఆలౌట్ చేసిన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ పదునైన బౌలింగ్‌తో 95 పరుగులకే కుప్పకూల్చింది. స్టార్క్ మరోసారి విజృంభించి బంగ్లా పతనంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 210 పరుగులు చేసింది. దీంతో బంగ్లాపై ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఈ మ్యాచ్‌లో స్టార్క్ మొత్తం 10 వికెట్లు పడగొట్టాడు. కమిన్స్ ఆరు వికెట్లు తీశాడు. నాథన్ లయన్ 3, జోష్ హేజిల్‌వుడ్ ఒక వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ 165/8 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు కామెరూన్ గ్రీన్ (67), నాథన్ లయన్ (32బి) విలువైన పరుగులు జోడించారు. తొమ్మిదో వికెట్‌కు 38 పరుగులు




రాబట్టారు. గ్రీన్ ఔటైనా సరే.. జోష్ హేజిల్‌వుడ్‌తో (6) కలిసి లయన్ పదో వికెట్‌కు 24 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. బంగ్లా బౌలర్లలో షోరిఫుల్ (7/48) ప్రభావం చూపించాడు. తస్కిన్, తైజుల్ ఇస్లామ్, మెహిదీ తలో వికెట్ తీశారు.



# ‘తుంబాడ్ 2’ సెట్లోకి అలియా?

వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ.. యాక్షన్ ప్రాధాన్యమున్న చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది బాలీవుడ్ కథానాయిక అలియా భట్. ఇప్పుడామె హారర్ చిత్రం ‘తుంబాడ్ 2’లో నటిస్తున్న సంగతి తెలిసిందే. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఆదేశ్ ప్రసాద్ దర్శకుడు. పెన్ స్టూడియోస్, సోహుమ్ షా ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా సెట్లోకి అలియా అడుగుపెట్టినట్లు తెలుస్తోంది. “జూన్‌లో ‘తుంబాడ్ 2’ మొదటి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం సినిమాలోని తదుపరి భాగాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో అలియా భాగమైంది. ఈ సీక్వెల్ హస్తార్‌తో ముడిపడి ఉన్న అతీంద్రియ ప్రపంచాన్ని అన్వేషిస్తూనే, కొత్త అంశాలను పరిచయం చేయనుంద”ని సినీవర్గాల సమాచారం. ఈ సినిమా వచ్చే ఏడాది డిసెంబరు 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# భర్త చనిపోయాక అలంకారాలను ఎందుకు తీసివేయాలి : అనసూయ

అనసూయ భరద్వాజ్ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ విభిన్నమైన విషయాలపై స్పందిస్తుంటారు. తాజాగా ఆమె భారతీయ సంప్రదాయాలు, స్త్రీల అలంకరణపై చేసిన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో తన తల్లి జీవితంలో జరిగిన మార్పులను ప్రస్తావిస్తూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తన తల్లి నుదుట బొట్టు, కళ్లకు కాటుక, తలలో పూలు పెట్టుకుని ఎంతో నిండుగా కనిపిస్తుండేదని తెలిపారు. అయితే మూడేళ్ల క్రితం తండ్రి కన్నుమూసిన తర్వాత తల్లి ఆ ఆచారాలన్నింటికీ దూరమవ్వడం తనను తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు. ఆడపిల్ల పుట్టగానే అమ్మ, అమ్మమ్మలు గాజులు, గోరింటాకు, కాటుక వంటి అలంకారాలను అలవాటు చేస్తారని.. అలాంటప్పుడు వీటిని పెళ్లితో ముడిపెట్టి, భర్త చనిపోయాక ఎందుకు తీసివేయాలని అనసూయ ప్రశ్నించారు. ఒకవేళ తీసేయాల్సి వస్తే, ఆ అలవాట్లను నేర్పించిన అమ్మ లేదా అమ్మమ్మ చనిపోయినప్పుడు తీసేయాలి కానీ, భర్త మరణంతో వీటికి లింక్ ఏంటని నిలదీశారు. ఈ వీడియో కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు ఆమెపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. సంప్రదాయాల గురించి మాట్లాడే అనసూయ, భర్త బతికుండగానే బొట్టు లేకుండా వీడియోలు చేయడంపై ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఇతరులకు నీతులు చెప్పే ముందు నువ్వు పాటిస్తున్నావా అని నిలదీస్తూ, ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్సయ్యావంటూ సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తున్నారు.



# ఆ ఒక్క సీన్ చేయడం చాలా కష్టమైంది : గౌరి ప్రియ

మెయిల్’, ‘రైటర్ పద్మభూషణ్’, ‘మ్యాడ్’ వంటి సినిమాలతో మెప్పించిన శ్రీ గౌరి ప్రియకు ఇటీవల వచ్చిన ‘చెన్నై లవ్ స్టోరీ’ ఓ సరికొత్త మలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఎమోషనల్ కామెంట్స్ చేశారు. “నేను సికింద్రాబాద్‌లోనే పుట్టి పెరిగాను. చిన్నప్పటి నుండి థియేటర్లలో సినిమాలు చూస్తూ, పాటలు వింటూ పెరిగినదాన్ని. ఈ రోజు అదే ఇండస్ట్రీలో ఒక భాగం కావడం నా కల నిజమైనట్లుగా అనిపిస్తోంది. ఎంతోమంది అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటారు, అలాంటిది దేవుడి దయ వల్ల నాకంటూ ఒక స్థానం దక్కడం చాలా ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోంది. ‘చెన్నై లవ్ స్టోరీ’ వచ్చాక ప్రజలు నన్ను వాళ్ళ ఇంట్లో మనిషిలా, ఒక చెల్లెలిలా భావిస్తున్నారు. ఆ సినిమాకు నో చెప్పి ఉంటే నా కెరీర్ వేరేలా ఉండేది. మొత్తానికి అదృష్టం కలిసొచ్చింది” అని చెప్పుకొచ్చారు. అలాగే ఈ సినిమాలో ఆ ఒక్క సీన్ చేయడం చాలా కష్టమైందని తెలుపుతూ.. “కథ విన్నప్పుడే ఈ ప్రాజెక్ట్‌కి ఒప్పుకోకపోతే నా లైఫ్‌లోనే పెద్ద తప్పు అవుతుందనిపించింది. ప్రేమ ఓటమితో బాధపడుతూ తాగుడికి అలవాటుపడే నివి అనే ఛాలెంజింగ్ రోల్‌ను నాపై నమ్మకంతో ఇచ్చినందుకు మేకర్స్‌కి థ్యాంక్స్. ముఖ్యంగా శ్మశానవాటికలో వచ్చే సన్నివేశం చేయడం శారీరకంగా, భావోద్వేగపరంగా చాలా కష్టమైంది. సినిమా చూశాక నివి పాత్రలో మమ్మల్ని మేమే చూసుకున్నాం అని ప్రేక్షకులు మెసేజ్‌లు చేస్తుంటే నటిగా ఎంతో గౌరవం పెరిగినట్లు అనిపించిందని అన్నారు. థియేటర్లలో ఈ సినిమాని చాలామంది పదే పదే చూశారు. లవ్ స్టోరీలను ఆడియెన్స్ ఎలా తీసుకుంటారో చెప్పలేం, కానీ ఈ భావోద్వేగానికి అందరూ బాగా కనెక్ట్ అయ్యారని.. ఇప్పుడు ఆగస్టు 21 నుంచి ‘సోనీ లివ్’లో స్ట్రీమింగ్ అవుతోందని చెప్పారు. ఇది తమకు రెండో రిలీజ్ లాంటిదని, థియేటర్లలో చూడనివారు ఓటీటీలో చూసి ఖచ్చితంగా ఆస్వాదిస్తారని శ్రీ గౌరి ప్రియ తెలిపారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com